# కలలోని యథార్థం

ఎవరో నిద్రలేపినట్టుగా జోగారావు పక్కమీద లేచి కూర్చున్నాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. జాగర్తగా ఆలకిస్తే, లీల ఊపిరి పీల్చటం వినిపిస్తున్నది.

కిందహాలులో ఉన్న గడియారం మూడు కొట్టింది.

జోగారావు తాను కన్న కలను తలుచుకుంటూ మళ్ళీ పక్కమీద వాలాడు. మళ్ళీ నిద్రపట్టే లక్షణాలేవీ కనిపించలేదు.

అతను కన్న కలలో విశేషమేమీ లేదు. పదేళ్ల కిందటి జీవిత వాతావరణం ఎందుకో మళ్ళీ కలలోకి వచ్చింది. ఆ కటిక దరిద్రపు దినాలూ, ఆ ఊరికొంపా, హామక్‌లాంటి నులకమంచమూ, మసిబారి, పైన ఒక పెళ్ళ విరిగి, కాగితంతో అంటించిన చిమ్నీగల హరికేన్ లాంతరూ కనిపించాయి. అప్పటికింకా తను లీలను ఎరగడు. ఆమె పేరు లీలకూడ కాదు. అయినా ఈ కలలో ఆమెకూడా ఉన్నది. కలలో అతను ఆ ఊరికొంపనూ, కుక్కి మంచాన్నీ, హరికేను లాంతర్నూ, లీలనూ ఎంత ప్రేమగా చూచాడు! ఈ అర్థంలేని కల కంటున్నంత సేపు అతని మనసు ఎంత నిర్మలంగా ఉంది!

దారిద్ర్యంలో ఆనందం ఉన్నదనే సిద్ధాంతాన్ని జోగారావు బుద్ధిపూర్వకంగా ఏనాడూ ఆమోదించలేదు. కాని ఇప్పుడాలోచించుకుంటే తాను ఆత్మ వంచన చేసుకున్నాడేమోనని అనుమానం కలగసాగింది. డబ్బులో ఆనందం ఉందా? సుఖాల్లో ఆనందం ఉందా? చిత్తశుద్ధిగా జోగారావు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోలేకపోయాడు.

ఒకప్పుడు జోగారావు మధ్యతరగతి దరిద్రుడు. మధ్యతరగతి దారిద్ర్యానికీ, తక్కువ తరగతి దారిద్ర్యానికీ తేడా ఏమిటంటే, రెంటిలోనూ ఆహారసమస్య ఒకటే అయినా, మధ్యతరగతి దరిద్రుడు తన ఆకలి చంపుకోవటానికి అడుక్కు తినటమో, కూలి చేసుకోవడమో, దోచడమో చేయలేడు. మధ్యతరగతి వాళ్ళకు దోపిడీ చేతకాదని కాదు. ఇష్టంలేదనీ కాదు, అయితే తక్కువ తరగతి వాళ్ళలాగా వీళ్ళు పరగడపునా, చట్ట విరుద్ధంగానూ దోచలేరు. తమ అవసరాలు గడవగా, విలాసాలు తీరగా చేతిలో మిగలటం మొదలు పెడితేగాని చట్టం చాటు దోపిడీకి దిగలేరు.

తన దారిద్ర్యంలో జోగారావు కథలూ, వ్యాసాలూ రాసేవాడు. అతని సాహిత్య

విమర్శలు తెలివిగా ఉండేవని చదివిన కొద్దిమందిలో కొద్దిమంది అనుకునేవాళ్ళు. రచయితగానూ, విమర్శకుడుగానూ జోగారావు ఆ కాలంలోనే సాహితీపరులలో కొంత ఖ్యాతి గడించాడు. ఆ రోజుల్లో ఏ కథకన్నా అయిదు రూపాయలు మని ఆర్డరువస్తే ఎంత ఆనందంగా ఉండేది! ఆ రోజుల్లో డబ్బు గారడీలు చేసి చూపేది జోగారావు చేతుల్లో. రోజుకు పావలాతో పొట్టనింపటం ఎట్లా? జోగారావు ఆ "ఫీట్" చాలా నెలలు చేశాడు. తనే వంట చేసుకునేవాడు, అన్నంలో ఉల్లిపాయ ముక్కలూ, ఉప్పూ, కారమేసుకుని, ఇంత నూనె కలిపి మూడు ముద్దలు తిని మజ్జిగలో నిమ్మకాయా ఉప్పూ కలిపి తాగితే కొన్ని పరిస్థితుల్లో అత్యంతానందం కలుగుతుంది. ఎంత తక్కువతో అవసరాలు గడుపుకోవచ్చునో అన్వేషించటంలో ఆనందం ఉంది. ఈ ఆనందాన్ని జోగారావు ఎరుగును – కాని గుర్తించలేదు.

జోగారావూ, లీలా పట్నం వచ్చిన తరువాత కూడా చాలా రోజులు అన్నం తినలేదు. ఉదయం, సాయంకాలం హోటలుకు వెళ్ళి డబ్బుకు యెంత తక్కువ తినవచ్చునో అంత తినేవాడు. నాలుగేసి ఇడ్లీ, సాంబారూ, అరకప్పు కాఫీ తాగితే జానెడు కడుపూ నిండేది. సాయంకాలం కారియరులో అయిదణాల భోజనం తెచ్చుకుంటే ఇద్దరికీ సరిపోయేది.

రాజ్యాలేలేవాళ్లు రాజకీయ సమస్య ఎదుర్కోవటానికి ఎంత తీవ్రంగా ఆలోచించి, ఎటువంటి యుక్తులు సాగిస్తారో, ఒక్కొక్క రూపాయి సంపాదించటానికి, అది సాధ్యమైనంత నింపాదిగా చెయ్యిదాటి పోవటానికి జోగారావు అంత శ్రమా పడేవాడు. ఈ శ్రమ ఫలించినంతవరకూ ఆనందం కలుగుతూనే వుండేది.

అప్పట్లో జోగారావు ఈ ఆనందాన్ని గుర్తించకపోవటానికి కారణమేమంటే అతను వేరేకలలు పగటి కలలు కనటంలో నిమగ్నుడయిపోయినాడు. అప్పుడతను కన్న కలలు రెండే రెండు. ఒకటి లీలను సినిమాతార చెయ్యటం, రెండోది సాధ్యమైనంత నాగరికంగా బ్రతకటం.

తిండికి సరిగాలేని రోజుల్లోకూడా జోగారావు, "నిజమైన దారిద్ర్యం డబ్బు లేకపోవటం కాదు; ఉన్న డబ్బుతో సుఖంగా బతకలేకపోవటం" అని అవకాశం దొరికినప్పుడల్లా అనేవాడు. అతని లెక్క ప్రకారం పల్లెటూళ్లలో నివసించటమే ఒక పెద్ద దరిద్రం. మంచి రోడ్లూ, సొంత కారూ, ఆధునిక పద్ధతులమీద కట్టిన యిల్లూ, ఎలెక్ట్రిసిటీ, ఫ్లష్ సౌకర్యాలూ, పాశ్చాత్య పంపిణీ మీద బాత్‌రూంలూ, కొళాయిలూ, సింక్‌లూ, పడకగదులూ, డ్రాయింగురూంలూ, ఫర్నిచరూ, తివాసీలూ, క్రోటనులూ, కర్టెనులూ ఇవి లేకపోవటం నిజమైన దరిద్రం.

లీల సినిమాతార కావాలన్న కల నిజమైనప్పటికీ, తన యీ రెండోకోరిక యింత

బాగా నెరవేరుతుందని జోగారావు యెన్నడూ ఊహించలేదు. రెండూ నిజమయ్యాయి. కాని జోగారావు అర్ధరాత్రి మూడు గంటలవేళ తనకు ఆనందం యెందుకు లేకుండా వున్నదా, అని ఆత్మపరీక్ష చేసుకుంటున్నాడు.

## 2

ప్రస్తుతం జోగారావును వేధిస్తున్నది బాధ అనదగినంత పెద్దది కాదు, లివర్ సరిగా పని చెయ్యకపోవటం అనదగినంత చిన్నదీ కాదు. బెర్నార్డుషా నాటకం "మాన్ అండ్ సూపర్ మాన్"లో నరకంలో డాన్ య్వాన్ "బోర్డమ్" అనుభవిస్తున్నట్టుగా వున్నది అతని స్థితి. అదొక విధమైన చిరాకుతో కూడిన అసంతృప్తి. ఈ అసంతృప్తికి లీలే కారణమని అనుకోదలిస్తే జోగారావుకు మార్గాలు చాలా వున్నాయి. కాని అతను ఆ మార్గాలు అన్వేషించి ఆత్మవంచనకు గురి కాదలచలేదు. అతనికీ లీలకూ గల సంబంధం గడచిన మూడు నాలుగేళ్ళ కాలంలో చాలా మారిపోయింది. నిజమే గాని అందుకు లీలను తప్పు పట్టటం నిరర్థకం. పై పెచ్చు అతడు ఎనిమిదేళ్ళ నుంచీ ఆమెకు అనేక రకాలుగా రుణ పడివున్నాడు.

లీల అతని జీవితంలోకి అడుగు పెడుతూనే అతన్ని చాలా పెద్ద దుస్థితి నుంచి రక్షించింది. జోగారావు తన దరిద్రాన్ని పెళ్ళితో మరింత దుర్భరం చెయ్యక చాలా మంచి పనే చేశాడు గాని, ఈ పాడు సంఘంలో యే సమస్యను పరిష్కరించాలన్నా మరో కొత్త సమస్య ఏర్పడుతుంది. చిక్కేమిటంటే జోగారావుకు బ్రహ్మచర్యం సాధ్యం కాలేదు. కొందరు బ్రహ్మచర్యం సులువుగా నెరపగలరు. కాని, జోగారావు యీ తరగతికి చెందినవాడు కాడు. అతను తన పరిసరాలలో గల ఆడవాళ్ళను - ఇతరుల భార్యలను ఆధారం చేసుకుని తన బ్రహ్మచర్య భారం తేలిక చేసుకోసాగాడు. ఇందువల్ల అమాయకులైన స్త్రీలని అపాయానికి గురి చేస్తున్నాననే బాధ అతన్ని కాల్చుకు తిన్నది. వాళ్ళ మనశ్శాంతికి భంగం కలిగిస్తున్నానన్న ఆవేదన కూడా అతనికి కలగక పోలేదు. ప్రేమ కేవలం దేహ ధర్మమే. అయితే ఒకరిద్దరు స్త్రీలు అతనికోసం మానసికంగా బాధ పడటం జరక్కపోలేదు. ఈ నరకంలో నుంచి ఏనాటికైనా, యెవరైనా వచ్చి తనను ఉద్ధరిస్తారని అతను పెట్టుకున్న ఆశను లీల సఫలం చేసింది. ఆమెతో స్నేహం కలిసిన తరువాత అతను యితరుల భార్యల జోలికి పోలేదు.

లీల ఎవరి భార్యా కాదు. ఆమె కళావంతుల పిల్ల. ఆమెకు తల్లి గాక, తండ్రి కూడా వున్నాడు. కాని ఆ దుర్మార్గుడామెపట్ల తండ్రిలాగ ప్రవర్తించలేదు. పన్నెండేళ్లు నిండకముందే వాడు లీలను బజారులో పెట్టాడు. ఆమెలో మానసిక వాంఛలు మొగ్గ తొడగక పూర్వమే హేయమైన ఇంద్రియానుభూతి కలగటం చేత లీల మగవాళ్ళపై ద్వేషం

ఎందుచేతనంటే నిత్యజీవితంలో కూడా ఆమె భావ ప్రకటన ఎంతో నిండుగానూ, ఆకర్షవంతంగానూ వుండేది. అయితే విజయవంతంగా నటించటానికి ఈ సహజ శక్తి చాలదు. దానికి తోడుగా ఒక విధమైన మనస్తత్వం కూడా వుండాలి. ఆ మనస్తత్వం నిర్బంధాల మధ్య అలవడదు. దానికి మానసిక స్వాతంత్ర్యం అంతులేకుండా కావాలి. కళాకారుడు ముందుగా జీవితపు సంకెళ్ళ నుంచి తాను విముక్తి పొంది, తరవాత ప్రపంచాన్ని తన సంకెళ్ళలో బిగించే శక్తి సంపాదించాలి. కళకు సరియైన వాతావరణం లేని సాంఘిక వ్యవస్థలో కళాకారులు సంఘానికి వెలి కావటమో, అధమం సంఘ ధర్మానికి విలక్షణంగా జీవించటమో జరుగుతుంది. సాంఘిక వ్యవస్థ కళారాధనకు అనుకూలించే పరిణామాన్ని పొందిననాడే సామాజికులకూ కళారాధకులకూ మధ్య యేర్పడుతూ వుండే వైషమ్యం అంతరించటం జరుగుతుంది. అందాకా సంఘం కళాకారులను హీనంగా చూడటమో, నెత్తి కెక్కించుకుని పూజించటమో లేక ఒకేసారి రెండూ చేయటమో జరుగుతుంది. కాని కళాకారులను తమవాళ్లుగా తమ సోదరులుగా భావించటం మాత్రం జరగదు.

జోగారావు లీలకు యీ స్వాతంత్ర్యం యిచ్చాడు. సంఘం మానవుల మీద ఏర్పరచే ఏ నిర్బంధాన్ని కూడా లీల గుడ్డిగా, తప్పనిసరిగా ఆమోదించనవసరం లేకుండా చేశాడు. అసలే విహంగం లాంటి లీలను అతను స్వేచ్ఛా విహంగంగా మార్చాడు.

లీల నటించిన చిన్న పాత్రలే ప్రొడ్యూసర్లను ఆకర్షించాయి. ఆ పాత్రలను చూసి లీల కూడా సంతోషించింది. ఆమెకన్న విమర్శనాదృష్టి ఎన్నో రెట్లు అధికంగా గల జోగారావు ఆమె నటనతో తృప్తి పడలేదు. అందులో గల లోపం చాలావరకు ఆయా పాత్రలు రచించిన వాళ్ళదని, ఆమెను డైరెక్టుచేసిన వారిదనీ అతను తెలుసుకున్నాడు. నటులను విమర్శనా దృష్టితో గాక తమ పూర్వానుభవంతోనూ, వ్యాపార దృష్టితోనూ చూసే ప్రొడ్యూసర్లు ఆమెలో లాభాలు చూశారు. సరి అయిన మేకప్ మాన్ వుండి, మంచి ఫొటోగ్రాఫర్ చేతిలో పడితే లీల చాలా పైకి వస్తుందనీ, లక్షలాది సినిమా ప్రేక్షకులు ఆమె కోసం వెర్రెత్తి తమపై కనకవర్షం కురిపించవచ్చుననీ ప్రొడ్యూసర్లు గుర్తించారు.

అయితే ప్రొడ్యూసర్లు వేటగాళ్ళవంటివాళ్ళు. వాళ్ళు తొందరపడి తుపాకీ పేల్చి పిట్ట పారిపోవటానికి ఒప్పరు. లీల చౌకగా వస్తుంది. కాని, తాము ఏమాత్రం ఆత్రం ప్రదర్శించినా ఆమె రేటు పెరగవచ్చు. అందుకని వారువెయ్యి కళ్ళతో కనిపెడుతూ వల చేతబట్టి పొంచున్నారు. ఇంతలో ఎవరో ప్రొడ్యూసరు తూలాడు. అతడికి పాపం, గత్యంతరం లేకపోయింది. అతని 'తార' అతన్ని పిండటానికి నిర్ణయించి పేచీలు పెట్టసాగింది. తీరా సంతకం పెట్టవచ్చే సమయానికి తాను అదివరకు కోరి ఒప్పించిన తొంభై తొమ్మిది హిరణ్యాక్షవరాలకు తోడుగా నూరోది కోరింది. అప్పటికే మూడు కంట్రాక్టులు చించి

మాత్రమే యెరుగును. మగవాళ్ళ స్నేహం యెరగదు. ఆమె కాలోటును జోగారావు తీర్చాడు. అతని మూలంగా లీలలో ఆడతనం పరిపూర్ణత్వం పొందింది. ఆమె అతని ప్రభావాన్ని పూర్తిగా స్వీకరించడమే గాక, ప్రపంచంలో వున్న ఒక్క గొప్పవాడూ తనవాడైనట్టు భావించి గర్వించింది. ఇతనితో నరకానికి పోవటానికైనా సిద్ధపడి తన తండ్రిని ధిక్కరించి, ఇల్లు విడిచి అతనితో పట్నం వచ్చేసింది. పట్నంలో యిద్దరూ కలిసి చాలా యిబ్బందులు పడ్డారు. కాని జోగారావు మీద విశ్వాసంతో ఆమె యే కష్టాన్నీ ఖాతరు చెయ్యలేదు. ఏ సమస్యను గురించీ తను స్వయంగా ఆలోచించలేదు. అతని యందు ఆమెకు గల విశ్వాసం అన్ని పరీక్షలకూ నిలబడ్డది.

అయితే లీల ఎన్నడూ జోగారావుచేతి కీలు బొమ్మగా వుండలేదు. అతనికి ప్రతిబింబం అసలేకాదు. ఆమెను తన ప్రతిబింబంగా చెయ్యాలని జోగారావు ఎన్నడూ ప్రయత్నించలేదు. ప్రయత్నించాలని అతనికి తట్టను కూడా లేదు. జోగారావుకు అన్నిటికన్నా భావనా స్వాతంత్ర్యం మీద విశ్వాసం హెచ్చు. ఇంకొకరి భావనా స్వాతంత్ర్యాన్ని అరికట్టడం కన్న మనిషి చేయగల సాంఘిక పాతకం మరొకటి లేదని అతని విశ్వాసం. తన స్వాతంత్ర్యాన్ని అరికట్టటానికి ప్రయత్నించిన వారినందర్నీ అతను వెలి వెయ్యటం చేతే జీవితంలో దాదాపు ఒంటరి వాడైనాడు. అతనికి మిగిలిన కొద్ది స్నేహితులు కూడా సాంఘికంగా తన వర్గానికి చెందినవారు కాదు; తాను తన వర్గ ధర్మాన్ని ఆచరిస్తున్నాడా లేదా అని విమర్శించని వాళ్ళు మాత్రమే...

లీలకు సినిమాల్లో నటించే అవకాశం దొరికివుంటే అందుకు పూర్తిగా జోగారావు కృషి కారణం. అతను ఆమెయందు పరిపూర్ణమైన విశ్వాసం కనబరిచాడు. ఏదో విధంగా సినిమా తార చెయ్యాలన్న ఆవేదన మాత్రమే అతనిలో వున్నట్టయితే అతను జయించి వుండకపోను. కాని, ఆమె ఏనాటికన్నా గొప్ప సినిమా నటి అయి తీరుతుందని అతనికి గల పరిపూర్ణ విశ్వాసం క్రమంగా యితర్లకు కూడా సంక్రమించింది. ఎందుచేతనంటే జోగారావు అందరు ప్రొడ్యూసర్ల చుట్టూ లీలను వేసుకు తిరిగినప్పటికీ ఎవరి దగ్గరా ప్రాధేయపడలేదు. ఆమె యందు వారువిశ్వాసం కనబరచనందుకు వారిని నిందించనూ లేదు. ఆమెను తీసుకోకపోవటం వల్ల ప్రొడ్యూసర్లే నష్టపడతారన్న నమ్మకం అతనిలో బలంగా వున్నప్పుడు ఒకరిద్దరు ప్రొడ్యూసర్లన్నా ఆ నమ్మకానికి గురికాక తప్పదు. అదే జరిగింది. లీలకు వరసగా ఒకదాని తరువాత ఒకటిగా రెండు చిన్న చిన్న వేషాలు లభించాయి.

జోగారావు లీలను సినిమాలలో ప్రవేశపెట్టటమే కాదు, ఆమెకు నటించే శక్తికూడా కలిగించాడు. నిజానికి ఆమె నటించటానికి పుట్టిన మనిషే. దానికి సందేహం లేదు.

నాలుగోది రాసిన ఆ ప్రొడ్యూసరు, నాలుగోది చింపివేసి, తన 'తారని' పంపేసి వెంటనే కారెక్కి లీల దగ్గరికి పోయి, "ఇదిగో నేను ఎల్లుండి ప్రారంభించే పిక్చరులో హీరోయిన్ వేషానికి కాంట్రాక్టు, అంకె మాత్రం వెయ్యలేదు. ఎంత కోరతావో చెప్పు. నా కిష్టమైతే నువ్వు చెప్పిన అంకె వేస్తాను. లేదా పిక్చరు మానుకుంటాను" అన్నాడు.

కాంట్రాక్టు ఫారం తీసుకుని జోగారావు లీల చేతికిచ్చి ఎక్కడ సంతకం చెయ్యాలో చూపించి సంతకం చెయ్యమన్నాడు.

"అంకె?" అన్నాడు ప్రొడ్యూసరు.

"మీకు గిట్టినంత వెయ్యండి, మీరు నష్టపడి లీల డబ్బు తీసుకోనవసరం లేదు. మీరు మా ఇంటికి వచ్చారు. మేం మీదగ్గరికి రాలేదు. అతిథులతో ఎవరూ బేరం చెయ్యరు."

వ్యాపారస్తుడిలో మానవత్వం తల ఎత్తింది. ఆరువేల దగ్గర పాటప్రారంభించి ఎనిమిదివేల దగ్గర ఆపుచేద్దామనుకున్న ప్రొడ్యూసరు పదివేలు అంకె వేశాడు.

"ఇద్దామనుకున్న దానికన్నా రెండువేలు ఎక్కువ వేశాను. లీల నాకు మనస్ఫూర్తిగా పనిచేస్తుందని తెలుసుకున్నాక యీ రెండు వేలూ యింకో రకంగా నాకు గిట్టకపోవన్న ధైర్యం కలిగింది."

ప్రొడ్యూసరు సెలవు పుచ్చుకున్నాడు. ఆమెమీద కన్నువేసి వున్న మరి యిద్దరు ప్రొడ్యూసర్లు ముగ్గులోకి దిగారు. మొదటి ప్రొడ్యూసరును తిట్టుకుంటూ వాళ్ళు కూడా పదేసి వేలకు కాంట్రాక్టు రాసి, ఇంత తెలివిమాలిన పని ఎందుకు చేశామా అని చాలా రోజులపాటు ఆశ్చర్యపడ్డారు.

## 3

అటుతరవాత లీల పైకి రావటంలో జోగారావుకు సంబంధం లేకుండా పోయింది. ఈ యేడు ఆమె ఆరు కాంట్రాక్టులపై సంతకాలు పెట్టింది. ఒక్కొక్కటీ ముప్ఫైవేలు. కిందటేడే లక్షరూపాయలు పెట్టి ఈ యిల్లు కట్టించారు. కాని ఇందులో జోగారావుకు ఎటువంటి నిమిత్తమూ లేదు. ఈ రెండు మూడేళ్లుగా తెరమీద ఆమె సౌందర్యం ఎంతో పెంపొందింది. ఆమె నటన ఎంతో ప్రతిభ సంపాదించుకున్నది. కాని, దీనికి తోడ్పడ్డవాళ్ళు మేకప్ చేసేవాళ్ళు, ఫొటోగ్రాఫర్లూ, డైరెక్టర్లూ, ఆమెకు ప్లేబాక్ పాడినవాళ్లూ, ఆమె కొరకు పాత్రలు రచించిన వాళ్లూనూ. ఇందులో జోగారావుకు ప్రమేయం ఏమీ లేదు.

సినిమా ప్రపంచంలో కాలు నిలదొక్కుకున్నాక లీల అనేక విషయాలలో వెనకటికన్న వెనక్కుపోయింది. ఆమె వెంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లించింది. అభిషేకాలు చేయించింది. తొడుగులు తొడిగించింది. గడిచిన రెండు మూడేళ్ళనుంచీ యిద్దరు ముగ్గురు

జ్యోతిష్కులను పోషిస్తున్నది. నాడీ గ్రంథాల వాళ్ళనూ పోషిస్తున్నది. ఇవన్నీ కాక ఆమె తనను పైకి తీసుకు రావటానికి తోడ్పడే వారందరికీ తన శరీర సౌఖ్యం యిస్తున్నది. తన అభివృద్ధికి ఆటంకంగా వుండగల పురుషులను ఇంకోవిధంగా వశం చేసుకోవటానికి ఆమె ప్రయత్నించటం కూడా లేదు. కేవలం తన శరీరంతోనే జయిస్తున్నది.

లీలను చూసి అసూయపడే వాళ్ళూ, ఆమె పతనాన్ని కోరేవాళ్ళూ కూడా ఆమె మీద దుష్ప్రచారాలు చేస్తూనే వున్నారు. ఆమెను భయపెట్టి డబ్బు గుంజలేనివాళ్ళు పత్రికల్లో ఆమెను గురించి అవాకులూ చెవాకులూ రాస్తూనే వున్నారు. ఈ ప్రచారం చూసి లీల బెదిరిందిగాని, జోగారావు ధైర్యం చెప్పాడు.

"నీ వృత్తికి నీ అపఖ్యాతి అడ్డురాదు. నీకు మొగుడనే పేరుతో నేనున్నన్నాళ్ళూ యెవరూ ఏమీ చెయ్యలేరు. నీ మీద రాళ్ళు వేసేవాళ్ళే గాయపడతారు."

లీల కృతజ్ఞతతోను, గాయపడిన ఆత్మాభిమానంతోనూ కంట నీరు కారుస్తూ జోగారావును కౌగిలించుకుని ముద్దుపెట్టుకున్నది. ఆమెను తెరమీద చూస్తేనే లక్షలాది ప్రేక్షకులకు పారవశ్యం కలిగినప్పటికీ యిటీవల జోగారావును ఆమె ఆలింగనం కదిలించలేకుండా వుంది. ఒకప్పుడు ఆమె కుండిన లావణ్యమూ అందమూ యిప్పుడు లేవు. నిద్రాహారాలు సరిగాలేని సినిమా నటనా, ప్రేమ రహితమైన కామ సంతృప్తీ ఆమె సౌందర్యాన్ని అపహరిస్తున్నాయి. ఆమె సహజ సౌందర్యం క్రమంగా తగ్గినా, కృత్రిమ సౌందర్యం దిన దిన ప్రవర్ధమాన మౌతున్నది.

## 4

రెండు నెల్ల క్రితం లీల సినిమా వృత్తిలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది. ఆమెతో కూడా మరి కొందరు కలిసి సొంతాన పిక్చరు తీయాలని తల పెట్టారు. ఇది జోగారావుకిష్టంలేదు. కాని, ఆమె నిరుత్సాహపడేట్టు కనపడటం చేత అతను వద్దనుకోలేదు. ఈ ప్రయత్నం చాలా నష్టదాయకం కానున్న లక్షణాలు యిప్పటికే కనిపిస్తున్నాయి. ఈ పిక్చరు నిర్వహణ బాల నాయకత్వంగానూ, బహు నాయకత్వంగానూ వున్నది. ఇంకా ఆలూ చూలూ లేకపోయినా లీల చేతి డబ్బు ఇరవైవేల దాకా వదిలింది. మిగిలిన వాళ్ళది యెంతెంత వదిలిందీ లీలకు సరిగా తెలియదు. జోగారావుకు ఆమె వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవటం యిష్టం లేదు. తాను కథలు రాసేవాడై వుండి కూడా అతను కథ అన్నది రాసి ప్రచురించి అయిదారేళ్ళైంది! లీల నటించే చిత్రాల కథల జోలికి ఎన్నడూ పోలేదు.

ఏ విధంగానూ లీలకు అడ్డం రావటం అతనికి యిష్టంలేదు. ఆమె స్నేహితులను

గురించీ, ఆమె తిరుగుళ్ళ గురించీ అతనెప్పుడూ విమర్శించలేదు. 'ఎక్కడికి వెళ్ళావు? ఎక్కడి నుండి వస్తున్నావు?' అని కూడా ఎన్నడూ అతను అడగలేదు. ఈ విషయంలో అతనికి అసూయ కూడా లేకపోయింది. ఎందుకంటే లీల తన స్థానాన్ని మరెవ్వరికీ యివ్వలేదు. మిగిలినదంతా ఆమె వృత్తితో ఎట్లా పెనవేసుకుని వున్నదంటే తన వృత్తికి భంగం లేకుండా ఆమె యీ సంబంధాలనుంచి బైటపడలేదు. కొత్తగా తియ్యబోయే పిక్చరులో కూడా యించుమించు అటువంటిదే.

ఇంకొకందుకు కూడా లీలను చూస్తే జోగారావుకు జాలివేసింది. నీతి మాలిన యీ ప్రపంచం కూడా సంఘ శాసనం యొక్క ప్రభావంలో వున్నది. లీలకు తనతో యిప్పుడిక పనిలేదు. కాని, పాపం ఆమె తనను విడిచెయ్యాలన్నా అది సాధ్యం కాదు. ఆమె తన భార్య అనే వంచనమీద ఆమె సినిమా జీవితమంతా నిర్మాణమయింది. సులభంగా లభించే విడాకులూ, పునర్వివాహాలూ లేకపోతే సినిమా ప్రపంచంలో వాళ్ళు ఈ కాడి మొయ్యక తప్పదు. లీలకింకా జోగారావు మీద ఏదో కొంత స్నేహభావం వుంది. అది లేకపోయినా ఆమె గతి యింతే. జోగారావు అసూయాపరుడైనా ఆమె గతి యింతే. కాకపోతే కొంపలో అశాంతి వుండదు.

లీలకు వర్తించినదే కొంతవరకు జోగారావుకూ వర్తిస్తుంది. లీలనుంచి అతనిప్పుడు వాంఛించేది ఆమె సంపాదన తప్ప యింకేమీ లేదు. అతనికి కావలసిన స్నేహం కూడా యిచ్చే తీరిక లేదు లీలకు. ఆమె యిప్పుడు చేస్తున్న కళారాధన కూడా ఏమీ లేదు. ఇప్పుడామెకు నటించటం ఒక కళాకాదు, కేవలం వృత్తీకాదు, అది ఆమెకు వ్యాపారం. ఆమె మనస్సిప్పుడు పిక్చర్లు తీయటం మీదా, డిస్ట్రిబ్యూటర్లతో కాంట్రాక్టులు చెయ్యటం మీదా, ఇతర నటులచేత పని చేయించుకుని వారి ద్వారా స్వలాభం సంపాదించటం మీదా పోతున్నది.

ఇందులో జోగారావుకు ఆసక్తి కలిగించేదేమీ లేదు. అరవ చెట్టియార్లను చూడటానికి పొరుగూళ్లకు కూడా వెళుతున్నది, వస్తున్నది. వాళ్ళూ వస్తున్నారు, వెళ్తున్నారు. తాను చేసే ప్రయత్నాలను గురించి ఆమె జోగారావుకు చెబుతుంది గాని అతని సలహా కోసం యెదురు చూడదు. ఎందుకు చెబుతుందో జోగారావుకు స్పష్టంగా తెలీదు.

జోగారావుకు పూర్వం - పూర్వాశ్రమంలో - కన్న కలలు నిజమయ్యాయి కాని, అవి కేవలం డొల్లగా పరిణమించాయి. చివరకు ఆ పాత జీవితం కల్లోకి కూడా వస్తోంది. రూపాయి డబ్బులతో మూడు నాలుగు రోజులు గడపటంలో ఒకప్పుడు కలిగిన ఆనందం ఇవ్వాళ లేదు. ఎట్లా వుంటుందీ? ఈ ఆశ్రమంలో తాను చేసే ప్రయత్నమూ లేదు, సాధించే విజయమూ లేదు. అందుకే ఆనందమూ లేదు. డబ్బుతో కొనదగిన సుఖాలున్నాయి. ఆనందం మటుకు లేదు.

పత్రికల్లో రోజూ ప్రజలు చేసే ప్రయత్నం కనిపిస్తూ వుంది. తమ స్వాతంత్ర్యం కొరకు పోరాడే ఆనందం కొరకు ఆసియా ఖండంలో అనేక ప్రాంతాల ప్రజలు ప్రాణాలర్పిస్తున్నారు. తన లీల ఒక్కరోజు సంపాదించే డబ్బు, ఏడాదిమీద సంపాదించలేక అలమటించే జనం అధిక సంఖ్యలో ప్రపంచమంతటా వున్నారు.

జోగారావు లీల డబ్బుకు దాసుడైపోలేదు. అట్లా అయిపోగలగితే అతనికి యే చిక్కూ లేదు. కాని ఆనందం కోసం జీవితంలో పోట్లాడాలంటే లీలకు సమస్య కలిగించి తీరాలి. లీలను అటువంటి స్థితిలో పెట్టే హక్కు తనకున్నదో లేదో జోగారావు నిర్ణయించుకోలేక పోయినాడు. ఆమెను తానే సినిమా తారగా చేశాడు. ఇప్పుడు లీల కొనసాగిస్తున్నది తన ఆశయాన్నే, కాని ఆమె సాధిస్తున్న ఫలితాలు తాను ఆశించినవి కావు, అందులో లీల తప్పులేదు. వాతావరణం అట్లా వుంది. తాను లీలను వదిలిపెట్టి తన కాళ్ళమీద నడిచి జీవితంలో ప్రవేశించాలంటే సరియైన సమయం లీల చితికిపోయిన తరవాతనే. కాని అప్పుడామెను విసర్జించటం భావ్యమా?

## 5

గడియారం ఐదు కొట్టడం విని జోగారావు పక్కమీద నుంచి లేచాడు. ఎందుకో అతనికి చిన్ననాటి అనుభవం ఒకటి జ్ఞాపకం వచ్చింది. మంచానికెదురుగా వున్న నిలువుటద్దంలో తన ఆకారం కనిపించగానే తన అన్న జ్ఞాపకం వచ్చాడు. అతను చాలా ఏళ్ళ క్రితం నాలుగు నెలలు మంచానపడి తీసుకున్నాడు. వ్యాధి నయమైన తరవాత అతను నడక మళ్ళా మొదటినుంచీ నేర్చుకోవలసి వచ్చింది. నిజానికి తను మాత్రం అటువంటి స్థితిలో లేడూ? లీల సంపాదనమీద బతకటం మానేసి తన కాళ్ళమీదే నిలబడటానికి ప్రయత్నిస్తే తాను పడిపోడూ? తప్పక పడిపోతాడు.

జోగారావు లీల మంచం దగ్గరికి వెళ్ళి దానిమీద కూర్చుని లీల ఒంటిమీద చెయ్యివేశాడు.

ఆమె కొంచెంగా కదిలిందిగాని నిద్ర లేవలేదు.

"లీలా? ఏయ్!"

"ఉండమ్మా నిద్దర చాల్లేదూ!"

"నేనూరికి పోతున్నా."

"ఏ ఊరికి?" అన్నది లీల, కళ్ళు మూసుకుని నిద్ర మత్తుగా.

"ఏదో ఊరికి!"

లీల బలవంతాన కళ్ళు తెరచి "ఏం?" అన్నది.

"ఏం లేదు, కొన్నాళ్లు తిరిగి రావాలని వుంది."

లీల పక్కమీద లేచి కూర్చున్నది, కాని, కాస్సేపు యేమీ అనలేదు.

"ఎప్పుడు వెళతావు?"

"ఇవ్వాళే."

"ఎక్కడికి?" మళ్ళా అడిగింది.

"ఏమో, ఇంకా యేదీ అనుకోలా."

"తోచటం లేదేమో, ఔనా?"

"అవును."

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?"

"గాలి మళ్ళినప్పుడు."

లీల మొహాన కత్తి వేటేస్తే నెత్తురుచుక్క లేదు. ఏదో మునిగిందని ఆమెకిప్పటికి తెలిసింది. ఆమె లేని ఉత్సాహం అభినయిస్తూ, "ఒకపని చేద్దాం. కాస్త నాకు తీరిక దొరికితే యిద్దరం కలిసిపోదాం" అన్నది.

"నీకు తీరికంటూ వుండదు. నువ్వు పనిగలదానివీ, నేను పనిలేనివాణ్ణీనూ."

లీల మొహం కాస్త చిట్లించి, "నామోషీగా వుందా?" అన్నది.

"ఎట్లా వుందో నాకే సరిగా తెలియటంలేదు, ఊరికే వున్నాననిపిస్తున్నది."

"వెళ్ళి ఏం చేద్దామని?"

"అదీ ఆలోచించలేదు."

"నా సంగతి?"

"నీకేం తక్కువయిందీ?"

"నువు వదిలేశావనిపించుకోనా?"

జోగారావు కొద్దిగా నవ్వాడు.

"నువ్వే నన్ను వదిలేశావని చెప్పు."

"నన్నొచ్చి అడుగుతారా?"

"పోనీ నే చెబుతాలే."

కాస్సేపు యిద్దరూ మౌనం.

"అకస్మాత్తుగా నామీద నీకెందుకంత కోపం వచ్చిందీ?"

"కోపమా? ఏం లేదే. నిన్నెప్పుడన్నా యేమన్నా అన్నానా? నువు నాకు చేసిన మేలు మరెవరు చేస్తారు?"

"మరెందుకు వెళ్ళటం?"

"నువ్వేదో చేశావనికాదు. నేనేమీ చెయ్యటంలేదని."

"ఎందుకు చెయ్యటంలేదూ? ఎన్ని సార్లడిగాను ఏదో ఒకటి చెయ్యమని? నువు చెయ్యకపోవటం నా తప్పా?"

"నీ విషయం తప్ప యింకొకటి ఆలోచించలేవా లీలా? చెయ్యటానికి సరియైన పనివుంటే నే చేసివుండనా?"

"ఇప్పుడు మాత్రం ఆ చిక్కుండదా? ఎందుకు నిష్కారణంగా వెళ్లిపోయి యిబ్బంది పడటం?"

జోగారావు మళ్ళీ నవ్వాడు.

"అంత ఏమీ చెయ్యలేక యిబ్బందిపడితే నేను తిరిగి రాకూడదా? అభ్యంతరం చెప్పవు గదా?"

ఆమాట లీలకు ఘాటుగా తగిలినట్టయింది. ఆమెకు కోపంకూడా వచ్చింది.

"అప్పుడే వెళ్ళిపోయినట్టు నువే మాట్లాడుతున్నావు గాని నేను నిన్ను పోవద్దనే అంటున్నాను" అన్నదామె దెప్పుగా.

"ఇన్నాళ్ళూ పోట్లాడుకోలేదు. ఇప్పుడూ వద్దు లీలా; స్నేహితులంగా వున్నాం, అట్లాగే వుందాం?"

"ఇంకెవతైనా దొరికిందా?" అన్నది లీల, కాస్సేపు ఆలోచించి.

"ఇంతవరకు లేదు. నువు దొరికిన తరువాత యింకెవతె మొహమూ చూడలేదు. సినిమా తారలు, భర్తలు ఎటువంటి పతివ్రతలో నీకు తెలీదూ?"

లీల పెదిమ కొరుక్కుంటూ ఆలోచించింది.

"ఇదంతా నాకేం బాగాలేదు" అన్నదామె.

జోగారావు తన వెనక వున్నప్పుడు యెవరితో ఎప్పుడెట్లా మాట్లాడాలో చాలా బాగా తెలిసిన లీల, యిప్పుడు జోగారావుకు ప్రతిగా మాట్లాడాలనేసరికి నోట తప్పా-తాలూ దొర్లిస్తున్నది.

"నా సంగతి ఆలోచిస్తే ఇంకా అసహ్యంగా వుంటుంది. ఈ ఏడెనిమిదేళ్ళలో బాగా తుప్పుపట్టిపోయినాను. అందుచేత విచారించవలసినవాణ్ణి నేను."

"అబ్బో! అప్పుడే ఐదున్నర అయిందే. నేనిప్పుడే వస్తా" అంటూ లీల లేచి వెళ్లిపోయింది. మళ్ళీ తనలో తాను మాట్లాడుకునే అవకాశం దొరికింది జోగారావుకు. ఎక్కడికన్నా వెళ్ళిపోదామన్నది మొదట్లో ఒక భావం మాత్రమే. దాన్ని ఎటో ఒకటు నిర్ణయంగా మార్చుకుందామనే జోగారావు లీలను మాటల్లో పెట్టాడు. ఈ సంభాషణ తరవాత అతనికి వెళ్ళిపోవాలనే నిశ్చయం కలిగింది.

లీల బైటికివెళ్ళి తిరిగి వచ్చేసరికి జోగారావు వెళ్ళిపోయాడు. అతని పర్సు కోటు జేబులోనే వున్నది. అది తీసుకోకుండానే అతను వెళ్ళిపోయివుండాలి.

లీలకు ఉక్రోషంకొద్దీ యేడుపొచ్చింది. తనకింత అవమానం యెవరూ చేయలేదు.

"ఏం చేశాను? నావల్ల యేం తప్పు జరిగింది? నన్నెందు కిట్లా శిక్షించాడు?" అని ఆమె మనస్సు ఆమెను ప్రశ్నిస్తున్నది. కాని యెవరు సమాధానం చెబుతారు?

ఎక్కడ చూసినా జోగారావును జ్ఞాపకంచేసే వస్తువులే. చిత్రమేమిటంటే లీలకు యీ యెడబాటు యివాళే అయినట్టులేదు. ఏనాడో అయినట్టూ, ఇవాళే తనకు తెలిసినట్టూ వున్నది. చచ్చిపోయినవాళ్ళను గురించి స్మరిస్తూన్నట్టుగా ఆమె తమ యిద్దరి జీవితాలకి సంబంధించిన విషయాలు జ్ఞాపకం చేసుకోసాగింది. ఇటీవల గడిచిన రెండుమూడేళ్ళలో జరిగిన సంఘటనలు ఒకటీ జ్ఞాపకం రాలేదు. కాని చాలా యేళ్ళక్రిందట జరిగినవి అనేకం జ్ఞాపకం రాసాగాయి.

లీల తన జన్మలో జోగారావును ఒక్కణ్ణే సరిగా ప్రేమించింది. రాను రాను తన పేరుమీదా, ప్రతిష్ఠమీదా ప్రేమ యేర్పడి జోగారావుమీద ప్రేమ మరుగున పడిపోయింది. ఎప్పటికైనా రెండు ప్రేమల్లో చేయిజారిపోయిన ప్రేమకు విలువ హెచ్చు, లీలకు గడిచిపోయిన రోజుల్లో కనిపించిన ఆనందం యిప్పటి రోజుల్లో కనిపించలేదు, ఆలోచిస్తే.

అయితే జోగారావుమీది ప్రేమ ఒకంతట జయించలేదు. మధ్య మధ్య లీల విచారానికి ఆగ్రహం అడ్డొస్తోంది. కాని తీరా ఆగ్రహం అయిపోయినాక కూడా విచారం మిగిలింది.

ఆ రాత్రి ఆమె ఒంటరిగా ఇంట్లో పడుకోవలసి వస్తే యెంత బాధపడేదో గాని ఆ రాత్రి షూటింగున్నది. దాన్ని ఆమె పూర్తిగా తగలేసింది. మర్నాడు కాల్‌షీట్ నిరాకరించి తనకు ఒంట్లో ఏమీ బాగాలేదని చెప్పింది. తెల్లవారు ఝామున మూడింటికి ఇంటికివచ్చి మేకప్‌కూడా కడుక్కోకుండా పడుకుని ఏడిచి నిద్రపోయింది.

మర్నాడామె ఇల్లు కదల్లేదు. టెలిఫోన్ చేసినవాళ్ళకూ, ఇంటికొచ్చిన వాళ్ళకూ తను ఇంట్లో లేనట్టు చెప్పించింది. జోగారావును మరిచిపోవటం లీల వుద్దేశమైతే ఆమె చాలా పొరపాటు చేసింది.

ఆ మర్నాడామె షూటింగుకు పోయినప్పుడు అందరూ జోగారావు గురించి అడిగారు. ఊరికెళ్ళాడని చెప్పింది. ఆరోజుకూడా షూటింగు రీటేక్స్‌తోనే జరిగింది. ఎట్లా పొక్కిందోకాని, లీలా జోగారావు విడిపోయినట్టు పట్నమంతా గుప్పుమన్నది, ఈ వార్త బైటనుంచే వచ్చివుండాలి.

***మొదటి ముద్రణ : ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, 1951***